సాక్షి
అనకాపల్లి
శనివారం ၊ 13 ၊ సెప్టెంబర్ ၊ 2025



వలిసె విలాపం

మన్యంలో వేరుశనగ తరువాత అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే వలిసె పంట విస్తీర్ణం ఏటా తగ్గిపోతుండటం పర్యాటకులకు నిరాశ కలిగిస్తోంది. 8లో



గంజాయి రవాణాను అరికట్టాలి

గంజాయిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. 8లో

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులలో ఆకాశం మేఘావృతమై ఉండి, తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గరిష్ట ఉష్ణోగ్రత 28.2 నుంచి 33.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 24.3 నుంచి 25.6 డిగ్రీలు నమోదు కావచ్చన్నారు.

అరుణాచలంలో జిల్లా వాసి హత్య!

- వెంకటాపురం మాజీ సర్పంచ్ కుటుంబం ఘాతుకం
- తమ కుమార్తెను ప్రేమించాడని దారుణం



డెక్కా నవీన్ మృతదేహం, (ఇన్‌సెట్) నవీన్ (ఫైల్)

అచ్యుతాపురం : పొరుగు రాష్ట్రంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారంలో దేవరాపల్లి మండలం కాశీపాలెం గ్రామానికి చెందిన డెక్క నవీన్ యువకుడు హత్యకు గురైనట్లు సమాచారం. పోలీసులు ధ్రువీకరించనప్పటికీ ఈ దుర్ఘటన జరిగినట్టు శుక్రవారం రాత్రి విస్తృతంగా ప్రచారమైంది. నవీన్ రాంబిల్లి మండలం చిన్నపూడి గ్రామంలో అమ్మమ్మ వద్ద ఉంటున్నాడు. రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన టీడీపీ మాజీ సర్పంచ్ కుమార్తెతో పదో తరగతి, ఇంటర్ నుంచి అతడికి స్నేహం ఏర్పడింది. వీరి సాన్నిహిత్యం గురించి తెలిసి యువతిని చెన్నైలో చదివిస్తున్నారని, అయినా వీరి మధ్య పరిచయం కొనసాగిందని, అదే అమ్మాయి తరపు వారికి కంటగింపుగా మారిందని సమాచారం. నవీన్ వేరే కులానికి చెందినవాడు కావడం, పెద్దగా చదువుకోకపోవడం, ఆస్తి లేకపోవడంతో అమ్మాయి తల్లికి ఇష్టం లేదు. మూడు రోజుల క్రితమే అమ్మాయిని తీసుకొని తల్లి అరుణాచలం వెళ్లింది. నవీన్‌కి ఫోన్ చేసి వారు ఉన్న చోటుకు రప్పించారు. అక్కడ ఒక లాడ్జిలో రూమ్ తీసుకొని ఉన్నారు. నవీన్ ఫోన్‌లో అసభ్యకరమైన ఫొటోలు ఉన్నట్లు గమనించి లాక్కొని చితకొట్టేశారు. అనంతరం తమతో వచ్చిన ఇద్దరు వ్యక్తులతో నవీన్‌ను హత్య చేసినట్లు సమాచారం. అమ్మాయిని, ఆమె తల్లిని అరుణాచలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని.. ప్రస్తుతం ఇద్దరూ అక్కడ జైల్లో ఉన్నట్లు భోగట్టా.

భావ ప్రకటనా స్వేచ్ఛకు కళ్లెం రాజ్యాంగ విరుద్ధం



ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పత్రికలు, టీవీలు వ్యవహరిస్తుంటాయి. పాత్రికేయులు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు, ప్రభుత్వాల దృష్టికి తీసుకువస్తుంటారు. తప్పులు సరిదిద్దుకోవాలి గానీ రాసిన పత్రికపై, పాత్రికేయులపై కక్ష కడితే ఎలా? ఇటీవల సాక్షిలో ఒక రాజకీయ పార్టీ నేత మాట్లాడిన ప్రెస్‌మీట్‌ను వార్తగా రాస్తే.. ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై, సంబంధిత జర్నలిస్టుపై అక్రమ కేసు పెట్టి వేధిస్తున్నారు. ప్రజల గొంతుకగా నిలిచే మీడియా గొంతు నులిమే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతోంది. రాజ్యాంగం అందించిన భావ ప్రకటనా స్వేచ్ఛను అక్రమ కేసులతో పోలీసులు నిరోధించలేరు. వాస్తవాలను వెలుగులోకి తెస్తున్న సాక్షిపై కూటమి ప్రభుత్వం మొదటి నుంచి వేధించే ధోరణి అవలంబిస్తోంది. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను.

– డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, మాజీ ఎంపీ, అనకాపల్లి



పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న కూటమి ప్రభుత్వం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోంది. ప్రెస్ మీట్‌లో నాయకుడు ఇచ్చిన వార్తను ప్రచురిస్తే కేసులు పెట్టడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. పత్రికా స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం ఈ రాష్ట్రంలో లేదా? కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వాస్తవాలు వెలుగులోకి తెస్తున్న సాక్షిపై వేధింపులకు పాల్పడుతోంది. రాజకీయ పార్టీ నేత ప్రెస్ మీట్‌లో మాట్లాడిన మాటలను రిపోర్టర్ వార్తగా రాస్తే ఎడిటర్‌పై కేసులు పెడతారా? భావ ప్రకటన స్వేచ్ఛను అక్రమ కేసులు, నోటీసులతో నిరోధించలేరు. రాజకీయ కక్షతో సాక్షి ఎడిటర్‌పై కేసులు నమోదు చేయడం సరికాదు. కూటమి పాలనలో అన్ని వర్గాలను గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఈ విషయాన్ని గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి నేతలకు సరైన గుణపాఠం తప్పదు.

– డాక్టర్ గుమ్మా తనూజారాణి, ఎంపీ, అరకులోయ

ఎర్రమట్టి.. మనసు దోచే..

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్ తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలకు చోటు



సహజ వారసత్వ స్థలం జాబితాలో పొందుపరిచిన యునెస్కో

టెక్టానిక్ సిస్టమ్, కోస్టల్ సిస్టమ్ థీమ్‌లో ఎంపికయ్యే అవకాశం

సాక్షి, విశాఖపట్నం : అలల సవ్వడితో ఎగసిపడే నీలి సంద్రం ఓవైపు.. తూర్పుకనుమల్లో విచ్చుకున్న పచ్చందాల ప్రకృతి మరోవైపు.. మధ్యలో సూరీడే కిందికి దిగి.. ఎర్రరంగు పులిమినట్లు అరుదైన వారసత్వ సంపద చూపరులను కట్టిపడేస్తుంటుంది. సహజ సిద్ధమైన ప్రకృతికి ప్రతిరూపంగా.. విశాఖకు వచ్చే సందర్శకులకు వరంగా.. భీమిలిలో అందాలను ఎరుపెక్కించిన ఎర్రమట్టి దిబ్బలు నిజంగా అరుదైన సంపదే. ఆసియాలో కేవలం మూడంటే మూడు ప్రాంతాల్లోనే ఈ అద్భుతం కనువిందు చేస్తోంది. తొలుత ఇసుకకొండలుగా ఏర్పడి.. తర్వాత ఎర్రమట్టి దిబ్బలుగా రూపాంతరం చెందిన ఈ ప్రకృతి వరప్రసాదానికి సరిగ్గా పదకొండేళ్ల క్రితం జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు వస్తే.. ఇప్పుడు మరో అరుదైన గుర్తింపు కోసం పోటీ పడుతోంది. యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్–2025 జాబితాలో చోటు దక్కించుకునే దిశగా తొలి అడుగు వేసింది. సహజ వారసత్వ స్థలం తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలను చేర్చినట్లు యునెస్కో ప్రకటించింది.

2014లో జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తింపు

విశాఖపట్నం నుంచి భీమునిపట్నం వెళ్లే మార్గంలోని మట్టి దిబ్బలు 10 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించాయి. ఇవి ఒకప్పుడు 40 మీటర్లదాకా ఎత్తు ఉండేవి. జాతీయ భూవిజ్ఞాన సర్వే సంస్థ ఈ దిబ్బల ప్రదేశ రక్షణ, నిర్వహణ కోసం 2014లో జాతీయ వారసత్వ ప్రదేశంగా ప్రకటించింది. మొత్తం 1,195 ఎకరాల్లో 262.92 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఉన్న ప్రాంతాన్ని జియో హెరిటేజ్ సైట్‌గా గుర్తించారు.

యునెస్కో గుర్తింపు వస్తే...

యునెస్కో గ్లోబల్ పార్కు జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు చేరితే సంరక్షణ చాలా సులువు అవుతుంది. ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా ప్రత్యేక బాడీ ద్వారా ప్రకృతి సిద్ధ సందర్శన ప్రాంతంగా మరింత ఖ్యాతి పొందేందుకు వీలవుతుంది. ప్రస్తుతం సాలార్ జంగ్ మ్యూజియం సంరక్షణ అదే విధంగా సాగుతోంది. ప్రస్తుతం ప్రపంచంలోని 33 దేశాల్లో 120 యునెస్కో గ్లోబల్ పార్కులున్నాయి. ప్రపంచంలోని 196 దేశాల్లో వారసత్వ స్థలాలు గుర్తించేందుకు యునెస్కో సిద్ధమైంది. ఇందులో భాగంగా భారత్ నుంచి 69 ప్రాంతాలు యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్స్ జాబితాలో చోటు దక్కించుకునేందుకు పోటీ పడుతున్నాయి. ఈ జాబితాలో 5వ స్థానంలో ఎర్రమట్టి దిబ్బలు ఉన్నాయి. టెక్టానిక్ సిస్టమ్, కోస్టల్ సిస్టమ్ థీమ్‌లో ఎంపికయ్యే అవకాశం ఉందని యునెస్కో ప్రతినిధులు అంచనా వేస్తున్నారు.

ఇసుకే అయినా.. మట్టిదిబ్బలని...



పూర్వ కాలంలో వీటిని ఎర్ర ఇసుక కొండలుగానూ పిలిచేవారు. పాయలుగా ఏర్పడిన తర్వాత.. ఎర్రమట్టి దిబ్బలుగా పిలుస్తున్నారు. వాస్తవానికి భౌగోళిక పరంగా ఇది ఇసుక నుంచి రాయి ఏర్పడుతుంది. పొరలు పొరలుగా ఒక చోట చేరిన ఇసుక రేణువులే వేల సంవత్సరాల తర్వాత రాయిగా మారుతాయి. అలా ఒకచోట పేరుకుపోయిన ఇసుక క్రమంగా గట్టిపడటం మొదలవుతుంది. అది పూర్తి రాయిగా మారే క్రమంలో కాస్త మట్టిలా అనిపించే విధంగా మారుతుంది. ఇది ఇసుకే అయినా మట్టిలా గట్టిగా అనిపిస్తుంది. అదేవిధంగా ఇక్కడ దిబ్బల్లోని ఇసుక, మట్టి ఎరుపు రంగులో ఉండటం వల్ల వీటిని ఎర్ర మట్టి దిబ్బలుగా పిలవడం అలవాటైపోయింది.

ఎలా.. ఎప్పుడు ఏర్పడ్డాయంటే..?

ఈ ఎర్రమట్టి దిబ్బలు సుమారు 18,500 నుంచి 20,000 సంవత్సరాల మధ్య కాలంలో ఏర్పడినట్లు భౌగోళిక చరిత్ర చెబుతోంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం బంగాళాఖాతం ప్రస్తుత తీర రేఖ నుంచి కనీసం 5 నుంచి 10 కి.మీ వెనక్కి ఉండేది. తూర్పు కనుమల్లో ఖోండలైట్ శిలలు విస్తరించి ఉన్నాయి. ఈ శిలల్లో గార్నెట్, క్వార్ట్జ్, సిల్లిమనైట్, ఫెల్డ్‌స్పార్, ఇనుప ఖనిజాలు విస్తారంగా ఉంటాయి. భారీ వర్షాలు పడే సమయంలో ఈ కొండల నుంచి నీటి ప్రవాహాల ద్వారా కొట్టుకొచ్చిన మట్టి పదార్థాలు బంగాళాఖాతంలో కలుస్తాయి. ఇలా వరద నీటితో పాటు తూర్పుకనుమల్లో ఉన్న ఖనిజాలు కొట్టుకొచ్చి సముద్ర తీరంలోకి ఇసుకతో కలిసిపోయి మిశ్రమంగా ఏర్పడి పేరుకున్నాయి. కొండల్లోని మట్టి, సముద్రపు ఇసుక, ఖోండలైట్ శిలల్లోని ఖనిజాలన్నీ కలిసి కాస్తా గట్టిదనాన్ని సంతరించుకోవడం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఖనిజాల సమ్మేళనాలు ఆక్సీకరణం చెందడం వల్ల ఈ కొండలు ఎర్రగా మారిపోయాయి. ఏర్పడిన సమయంలో వీటిని ఎర్ర ఇసుక కొండలుగా పిలిచేవారు. కాలక్రమేణా ఈ గుట్టల్లో పేరుకుపోయిన మిశ్రమ అవక్షేపాల్లో వదులుగా ఉండేచోట నీటి ప్రవాహాల తాకిడితో కొట్టుకొని పోవడం వల్ల ఆ ప్రాంతం చిన్న చిన్న లోయలుగా రూపాంతరం చెందింది. క్రమంగా భారీ వర్షాల సమయంలో దాదాపు 3వేల సంవత్సరాల క్రితం వరకూ ఈ ఎర్రమట్టి దిబ్బలు నిరంతరం మార్పులు సంభవిస్తున్నాయి.

తొలుత 'బ్యాడ్ ల్యాండ్' అని పిలిచేవారంట!

ఈ ఆసక్తికరమైన దిబ్బల్ని 1,886లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరింటెండెంట్ విలియం కింగ్ రికార్డుల్లో నమోదు చేశారు. వీటిని అప్పట్లో బ్యాడ్ ల్యాండ్స్ అని పిలిచేవారు. ఎర్రగా ఎందుకు కనిపిస్తున్నాయనే దానిపై పరిశోధనలు చేసిన తర్వాత.. అందులో ఉన్న ఖనిజాల వివరాలు, ఇవి ఎలా ఏర్పడ్డాయని తెలుసుకొని అప్పుడు ఎర్రమట్టి దిబ్బలుగా నామకరణం చేశారని చరిత్ర చెబుతోంది. ఇవి క్వాటర్నరీ యుగానికి ఆనవాళ్లుగా నిర్ధారించారు. అప్పట్లో ఈ దిబ్బల్లో మానవ జీవన గమన విశేషాలు కూడా లభ్యమయ్యాయని చరిత్ర చెబుతోంది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బఫర్ జోన్ ఏర్పాటు

వారసత్వ ప్రదేశంగా జీఎస్ఐ గుర్తించిన తర్వాత 2016లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రక్షిత ప్రదేశాల విభాగంలో ఎర్రమట్టి దిబ్బల్ని చేర్చింది. తర్వాత దీనిపై అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. దీంతో చాలా మేరకు దిబ్బలు ఆక్రమణలకు గురయ్యాయి. తర్వాత వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాదాపు 148 అడుగుల మేర బఫర్ జోన్‌గా గుర్తించి ఆ ప్రాంతాన్ని సంరక్షించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎర్రమట్టి అక్రమ రవాణా చేస్తూ.. దిబ్బలపై విధ్వంస రచన చేస్తున్నారు. వీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నా.. పట్టించుకోవడం లేదు. యునెస్కో గుర్తింపు వస్తే ఎర్రమట్టి దిబ్బల సంరక్షణకు ఇక ఎదురుండదని పర్యావరణవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలు ప్రారంభం

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ పరిపాలన సౌలభ్యం కోసం అనకాపల్లి, విజయనగరంలో నూతనంగా నిర్మించిన వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలను సంస్థ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి, విజయనగరం ప్రాంత ప్రజలకు పరిపాలన పరంగా మరింత చేరువ కావడానికి వీలుగా వీఎంఆర్‌డీఏ నూతనంగా జోనల్ కార్యాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

తాచేరు డైవర్షన్ రోడ్డు పనులపై ఎందుకీ కక్ష?



పేటలో కోతకు గురైన డైవర్షన్ రోడ్డును పరిశీలిస్తున్న అమర్‌నాథ్



జోరువానలోను పేట డైవర్షన్ రోడ్డు పరిశీలనకు నాయకులతో కలిసి నడిచి వెళ్తున్న అమర్‌నాథ్

- అప్పుడు, ఇప్పుడు టెండర్లు దక్కించుకున్నది టీడీపీ కాంట్రాక్టర్లే
- పనులు పూర్తి చేయకుండా కాలయాపన
- మూడు జిల్లాల ప్రజల కష్టాలు కనిపించడం లేదా?
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ ఆగ్రహం
- జోరువానలో పేటలో డైవర్షన్ రోడ్డు పరిశీలన

బుచ్చెయ్యపేట: భీమునిపట్నం–నర్సీపట్నం(బీఎన్) రోడ్డులో డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయి మూడు జిల్లాల ప్రజలు తీవ్ర రవాణా కష్టాలు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జోరు వర్షంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి విజయరామరాజుపేట తాచేరు నదిపై కొట్టుకుపోయిన డైవర్షన్ రోడ్డును పరిశీలించారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో అప్పటి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి బీఎన్ రోడ్డు విస్తరణ కోసం రూ.110 కోట్లు మంజూరు చేయించామని అమర్‌నాథ్ తెలిపారు. అప్పట్లో ఈ రోడ్డు కాంట్రాక్ట్ పనులు దక్కించుకున్న ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే కావాలనే రోడ్డు పనులు చేయకుండా, కూలిన వంతెనలు కట్టకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. నెల రోజుల కిందట వర్షాలకు డైవర్షన్ రోడ్డు కోతకు గురైందన్నారు. మరమ్మతు పనులకు రూ.15 లక్షలు మంజూరు కాగా.. కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పది రోజులైనా నేటికి పనులు ప్రారంభించకపోవడంపై ఆయన మండిపడ్డారు. కావాలనే తాచేరు వంతెన, డైవర్షన్ రోడ్డు పనులపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ఇప్పుడు అధికారంలో ఉండగా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తూ కక్ష సాధిస్తోందని ఆరోపించారు.

సంక్రాంతికి రోడ్ల బాగు ఎక్కడ?

అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్రాంతి కల్లా రోడ్లన్నీ బాగు చేస్తామని గతేడాది ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ఏమైందని అమర్‌నాథ్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలైనా బీఎన్ రోడ్డు బాగు పడలేదన్నారు. ఏ రోడ్డును చూసినా పెద్ద పెద్ద గోతులు, వర్షపు నీరు, మట్టి దిబ్బలతో దీవులను తలపిస్తున్నాయన్నారు. ప్రజల రవాణా కష్టాలు తీర్చడానికి ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. అనకాపల్లి, విశాఖ, అల్లూరి జిల్లాల ప్రజలు బీఎన్ రోడ్డులో ఉన్న విజయరామరాజుపేట మీదగా రాకపోకలు సాగిస్తారన్నారు. డైవర్షన్ రోడ్డు గండి కారణంగా గౌరీపట్నం, తదితర ఇరుకు రోడ్ల మీదుగా రాకపోకలు సాగిస్తూ గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోతున్నారన్నారు. అయినా కూటమి నేతలు, ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. పేట డైవర్షన్ రోడ్డు మరమ్మతులు చేపట్టి రవాణా కష్టాలు తీర్చకపోతే ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, గొంపా చినబాబు, నాయకులు జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, గుమ్మిడి ప్రసాద్, కోరుకొండ రమణ, ఎల్లపు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో కేంద్ర టీం తనిఖీలు

మాకవరపాలెం: విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) టీం తనిఖీలు చేసింది. మండలంలోని భీమబోయినపాలెంలో ఉన్న ఈ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో శుక్రవారం కేంద్ర టీం వర్చువల్ విధానంలో తనిఖీలు చేపట్టింది. ఈ క్లినిక్‌లో గర్భవతులకు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అలాగే జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి అమలు చేస్తున్న పథకాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి సీతారామలక్ష్మి, ఎంపీహెచ్ఈవో సత్తిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కొండగెడ్డలు



ఉరకలేస్తున్న ఉరకగెడ్డ

మాడుగుల: మండలంలో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఉరకగెడ్డ, తాచేరు, గౌరిగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కేచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అధికమై పెద్దేరు జలాశయంలోకి 450 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో 400 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు కాగా ప్రస్తుతం 126.40 మీటర్లకు చేరింది. పెద్దేరుతోపాటు మిగిలిన గెడ్డలలోకి రైతులు దిగరాదని జలాశయం అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డులు ఎక్కడ?



- 10న ప్రారంభం కావాల్సిన పంపిణీ
- 'కూటమి' నేతల పెత్తనంతో ఆలస్యం
- కొత్త కార్డులకు నిలిచిన రేషన్ పంపిణీ
- ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు ఫిర్యాదులు
- కేవలం 2 మండలాల్లోనే పంపిణీ ప్రారంభం

సాక్షి, అనకాపల్లి: రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెంచేవిధంగా స్మార్ట్ రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకున్న 'కూటమి' నేతలు కార్డుల పంపిణీకి వారే అడ్డంకిగా నిలిచారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్మార్ట్ కార్డుల పంపిణీని ఈనెల 10వ తేదీన ప్రారంభించాలి. కార్డులు సిద్ధమైనా జిల్లాలోని కేవలం 2 మండలాల్లో మాత్రమే పంపిణీ మొదలైంది. జిల్లావ్యాప్తంగా 24 మండలాల్లోని 1063 రేషన్ డిపోల పరిధిలో 5,32,346 రేషన్ కార్డుదారులున్నారు. కనీసం ఇంతవరకు రెండు వేల స్మార్ట్ కార్డులు కూడా పంపిణీ జరగలేదు. కూటమి పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులతో పంపిణీని ప్రారంభించాలని అధికారులకు అనధికార ఆదేశాలున్నాయి. వారు ఇదిగో అదిగో అంటూ ఆలస్యం చేయడంతో ఈ ప్రక్రియ మొదలు కాలేదు. అనకాపల్లి, యలమంచిలి తదితర ప్రాంతాల్లో కూటమి నేతల మధ్య విభేదాలు కూడా ఇందుకు తోడయ్యాయి. మేమంటే మేమని ఒకరితో ఒకరు పోటీ పడుతూ పంపిణీకి బ్రేకులు వేస్తున్నారు.

కొత్త కార్డుదారులకు నిరాశ

స్మార్ట్ కార్డులు అందించకపోవడంతో కొత్తగా కార్డులు మంజూరైన 3,250 కుటుంబాలు రేషన్ అందక విలవిల్లాడుతున్నాయి. అధికారులు వీరి కోసం సరకులు రిలీజ్ చేశారు. కానీ వారి వద్ద ఎలాంటి కార్డు లేక పంపిణీ చేయలేని పరిస్థితి. దీనిపై ఫిర్యాదులు అందడంతో రెండు మండలాల్లో హడావుడిగా ఈ ప్రక్రియ ప్రారంభించారు. మిగతా చోట్ల స్మార్ట్ ఈ–పోస్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డులు మూలుగుతున్నాయి. కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ 'సాక్షి'తో మాట్లాడుతూ కూటమి పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల డేట్లు లేకపోవడంతో స్మార్ట్ కార్డుల పంపిణీలో జాప్యం జరగడం సరికాదని అన్నారు. తాను సీఎం కార్యాలయానికి, ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ 1967కు కాల్ చేసి ఫిర్యాదు చేసిన అనంతరం రెండు మండలాల్లో శుక్రవారం తూతూ మంత్రంగా ప్రారంభించారని చెప్పారు.

క్లుప్తంగా

16న జిల్లా స్థాయి కబడ్డీ జట్ల ఎంపిక

అనకాపల్లి: జిల్లా స్థాయి కబడ్డీ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 16న మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లి మండలం తుమ్మపాల క్రీడా మండలి మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి దాడి శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించి ఉండాలన్నారు. బాలురు 75 కేజీలు, బాలికలు 65 కేజీలు లోపు ఉండాలన్నారు. పోటీలో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి (విజయవాడ)లో జరిగే 51వ ఏపీ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారుల జట్లు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9963299492ను సంప్రదించాలని కోరారు.

'కేంద్ర ప్రభుత్వ పథకాలు సామాన్యులకు చేరాలి'



జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం

తుమ్మపాల: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) మాసాంతపు సమావేశం శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. దిశ కమిటీ చైర్మన్, ఎంపీ రమేష్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణమూర్తి పాల్గొని జిల్లా అధికారులతో వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందేలా చూడవలసిన బాధ్యత జిల్లా అధికార యంత్రాంగంపై ఉందని ఎంపీ రమేష్ అన్నారు. యూరియా పంపిణీ, సంక్షేమం, అభివృద్ధి గురించి కమిటీ సభ్యులకు కలెక్టర్ వివరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ అనకాపల్లి, యలమంచిలి రైల్వే స్టేషన్ల సాఫ్ట్ అప్‌గ్రెడేషన్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ యూరియా అమ్మకం, పంపిణీలో బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలన్నారు. డీఆర్వో సత్యనారాయణరావు, జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, ఏఎస్పీ ఎం.దేవప్రసాద్, ఆర్డీవోలు, షేక్ ఆయిషా, వి.వి.రమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీపీలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ వరకు చర్లపల్లి -నహర్లాగున్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల డిమాండ్ మేరకు ప్రస్తుతం చర్లపల్లి–నహర్లాగున్–చర్లపల్లి మధ్య నడుస్తున్న స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్ వరకు పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 13న సికింద్రాబాద్/చర్లపల్లి–నహర్లాగున్(07046) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్‌లో స్టేషన్‌లో బయలుదేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 16న నహర్లాగున్‌లో బయలుదేరే నహర్లాగున్–చర్లపల్లి/సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (07047) రాత్రి 9.45 గంటలకుసికింద్రాబాద్ చేరుకుంటుంది.

వలిసె విలాపం



చింతపల్లి ఆర్ఏఆర్ఎస్‌లో వలిసె సాగు పరిశోధన క్షేత్రం

మన్యం పేరు చెబితే ప్రకృతి అందాలకు నిలయమే కాకుండా పచ్చని కొండలు గుట్టల మధ్య పసుపు తివాచీ పరిచినట్లుండే వలిసె పూలు గుర్తుకు వస్తాయి. అందానికే కాకుండా మరో వైపు ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటగా వలిసెలకు గుర్తింపు ఉంది. వేరుశనగ తరువాత అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే ఈ పంట విస్తీర్ణం ఏటా తగ్గిపోతుండటం పర్యాటకులకు నిరాశ కలిగిస్తోంది. పర్యాటక సీజన్‌లో మంచు తెరల మధ్య వన్నెలద్దే వలిసె పూలు పూర్వ వైభవం కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

- ఏటా తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం
- ఫలించని శాస్త్రవేత్తల ప్రయత్నాలు
- పర్యాటక ప్రాంతాల్లో తగ్గనున్న శోభ
- సంప్రదాయ విత్తనాల వల్ల దిగుబడి తగ్గుదల
- అధిక వర్షాల వల్ల ఈ ఏడాది ఆలస్యంగా సాగు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

చింతపల్లి: వలిసె సాగు జిల్లాలో పాడేరు డివిజన్‌లో నూనె గింజల పంటగా గిరిజనులు సాగు చేస్తున్నారు. సంప్రదాయ విత్తనాల వినియోగం, ఆకాశ పందిరి కలుపు మొక్క ప్రభావం కారణంగా దిగుబడి తగ్గింది. దీంతో నిరాశకు గురవుతున్న రైతులు ఈ సాగుపై ఆసక్తి చూపడం లేదు.

- రెండు దశాబ్దాల క్రితం 6 వేల ఎకరాలకు పైగా ఉన్న సాగు విస్తీర్ణం ఏటా గణనీయంగా తగ్గిపోతోంది. గత రెండేళ్లలో 1500 నుంచి 1600 ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం ఇప్పుడు 1200 ఎకరాలకు తగ్గిపోయింది.

కారణాలివీ..

గిరిజన రైతులు సంప్రదాయ విత్తనాలను వినియోగించడం వల్ల దిగుబడి రావడం లేదు. మరోపక్క మార్కెటింగ్ సమస్యను ఎదుర్కొంటున్నారు. తేనెటీగలు తగ్గడం కూడా దిగుబడిపై ప్రభావం చూపిస్తోంది. రాజ్‌మా, వరి విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందజేయడం వల్ల ఆ పంటల సాగుపై రైతులు మొగ్గ చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం లేకపోవడం కూడా గిరి రైతులను నిరాశ పరుస్తోంది.

అనువైన రకాలు

ఎత్తయిన గిరిజన ప్రాంతాల్లో సాగు చేసేందుకు అనువైన రకాలను స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గుర్తించారు. జేఎన్ఎస్–28,30, జేఎన్ఎస్–2016, 1115, కేజీఎన్ –2 రకాలు వంద నుంచి 110 రోజుల్లో దిగుబడి వస్తుంది. జేఎన్ఎస్–6 రకం 110 రోజులు, జేఎన్ఎస్–9, ఉత్కల్ నైజర్–150 రకాలు 95 నుంచి వంద రోజుల్లో దిగుబడి వస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

త్వరలో చింతపల్లి నైజర్ 1,2 విత్తనాలు

ఇక్కడి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో వలిసెలపై ప్రత్యేకంగా జాతీయ ప్రాజెక్ట్ అమలు అవుతోంది.ఇక్కడ వేల రకాల విత్తనాలపై 2018 నుంచి పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులు అనుకూలంగా చింతపల్లి నైజర్ 1,2 రకాలు ఉన్నట్టు చింతపల్లి గుర్తించారు. వీటిపై పరిశోధనలు మరో రెండేళ్లు జరిపిన అనంతరం రైతులకు పంపిణీ చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.

ఈ ఏడాది ఆలస్యంగా..

ఈ ఏడాది ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడున సాగు ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఏటా ఆగస్టు నెలాఖరు, సెప్టెంబర్‌లో సాగు మొదలు పెడతారు. నవంబర్ నుంచి పూత వస్తుంది. జనవరి నాటికి దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది ఇప్పటివరకు సాగు చేపట్టిన పరిస్థితులు కనిపించలేదు.

అగ్రి టూరిజంలో సంకల్పించినా..

సాగు విస్తీర్ణం పెంచే చర్యల్లో భాగంగా రెండేళ్ల క్రితం చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అగ్రిటూరిజంలో ఈ పంటను చేర్చారు. రైతులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా ప్రయోజనం లేకపోయింది. ఇదే పరిస్థితి కొనసాగితే మన్యానికి శోభనిచ్చే వలిసె పూలు భవిష్యత్తులో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితులు లేకపోలేదు.

- వలిసె పూల మకరందాన్ని సేకరించే తేనెటీగలు పరాగ సంపర్కంలో కీలక పాత్ర పోషిస్తాయి, ఇది పంటల దిగుబడికి మరియు కొత్త మొక్కల పెరుగుదలకు సహాయపడుతుంది. వలిసె తోటల వద్ద తేనెటీగలు చేరడం సహజమే అయినా, ఇటీవలి కాలంలో తేనెటీగల సంఖ్య తగ్గడం వల్ల దిగుబడి తగ్గి గిరిజన రైతులకు నష్టం కలిగిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు.

గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు

- డీఐజీ గోపీనాథ్ జెట్టి



విశాఖ సిటీ: గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో డీఐజీ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులు రూ.10,04,89,621 స్వాధీనం చేసుకోవడాన్ని అభినందించారు. ఇప్పటి వరకు 1,119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచినట్లు చెప్పారు. అలాగే 51 మంది నిందితులపై పీడీ చట్టం , 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్లు ఆధారంగా 341 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. వీరిలో 24 మందికి 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. విశాఖపట్నం రేంజ్ పోలీసులు స్టే సేఫ్, నిదాన్, కాజ్, నాట్ గ్రిడ్ యాప్స్ ద్వారా పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కృషిని అభినందించారు. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలు, మహిళ మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. ఇటువంటి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. రేంజ్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యలపై చర్చించారు. భవిష్యత్తు కోసం తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులకు ఇబ్బందులు

- గొలుగొండ మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ మణికుమారి

గొలుగొండ: యూరియా కొరత వల్ల మండలంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ శాఖ అధికారులు సరైన సమాధానం చెప్పకుండా తప్పుదోవ పట్టిస్తున్నారని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మణికుమారి అధ్యక్షతను స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పుత్తడిగైరంపేట సర్పంచ్ పత్తి రమణ, నాగాపురం సర్పంచ్ యలమంచిలి రఘురాం ఎరువుల కొరతపై నిలదీశారు. వ్యవసాయశాఖ అధికారులు సరిగా స్పందించకపోవడం వల్లే ఈ సమస్య వస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో రైతులు కష్టాలు చాలా ఎక్కువగా ఉన్నాయని వాపోయారు. ఎంపీపీ మణికుమారి మాట్లాడుతూ మండలంలో సాగు విస్తీర్ణం, ఎంతమేర ఎరువులు అవసరం, ఇప్పటి వరకు ఎంతమేర వచ్చాయని వ్యవసాయ అధికారులను అడిగితే సరైన సమాచారం ఇవ్వలేదని వాపోయారు. మండలంలో ఎరువుల కొరత వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గొలుగొండలో తాగునీటి సమస్య గురించి సర్పంచ్ కసిపల్లి అప్పారావు, నాగాపురం ప్రభుత్వ పాఠశాలలో సమస్యల గురించి సర్పంచ్ రఘురాం ప్రస్తావించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో బాబూరావు, వైస్ ఎంపీపీ జక్కు నాగమణితోపాటు పలువులు పాల్గొన్నారు.

డిసెంబరుకు అనకాపల్లి స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి

- డీఆర్ఎం మోహిత్ సోనాహి ఆదేశం



అనకాపల్లి స్టేషన్‌లో అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాహి

అనకాపల్లి: దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) మోహిత్ సోనాహి అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. స్టేషన్ పరిధిలో 1, 2, 3 ప్లాట్‌ఫారంలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పగలు, రాత్రి సమయంలో స్టేషన్ పరిధిలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని, సీసీ కెమేరాల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. స్టేషన్ అభివృద్ధి పనులు ఈ ఏడాది డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం ప్రశాంత్, సీనియర్ డీవోఎం , డి.నరేంద్రవర్మ, ఏడీఎన్ కృష్ణయ్య, అనకాపల్లి స్టేషన్ మేనేజర్ సత్యనివాస్, ఆర్పీఎఫ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ కంటిర్ల నవీన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు మద్దతుగా సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న ఆటో డ్రైవర్ అప్పలరాజుతో ఆటో డ్రైవర్లు

అనకాపల్లి: ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి ఆటో డ్రైవర్లు వ్యతిరేకం కాదని, వారికి ఉపాధి లేకుండా పోయిందని గాజువాక 86వ ఆటో యూనియన్ అధ్యక్షుడు గొలగాని అప్పలరాజు వాపోయారు. ఆటో డ్రైవర్లకు ఆర్టీసీలో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ గాజువాక నుంచి విజయవాడ వరకూ శుక్రవారం ఉదయం 9 గంటలకు సైకిల్ యాత్రను ప్రారంభించారు. అనకాపల్లి నెహ్రూచౌక్ బస్టాండ్ వద్దకు చేరుకున్న అప్పలరాజుకు స్థానిక ఆటోడ్రైవర్లు మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ 400 కిలోమీటర్ల మేర ప్రయాణించి ఈ నెల 20న విజయవాడ చేరుకుంటానన్నారు. రోజుకు 50 కిలోమీటర్లు మేర సైకిల్ యాత్ర చేసి, రాత్రిళ్లు దేవాలయాల వద్ద బస చేస్తానన్నారు. విజయవాడలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లను కలిసి వినతిపత్రం అందజేస్తానన్నారు. వాహన మిత్ర పథకం వల్ల ఎటువంటి ఉపయోగం లేదని, రోజుకు ఆటో డ్రైవర్లకు రూ.41 మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూచౌక్ ఆటో యూనియన్ డ్రైవర్లు బీమవరపు శ్రీను, సంతోష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణ అన్యాయం

- నేడు చలో గుంటూరుకు పిలుపు



చోడవరం వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జి

చోడవరం: విద్య, వైద్య రంగాలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ శనివారం తలపెట్టిన రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు బి. బాబ్జి పిలుపు ఇచ్చారు. గుంటూరులో నిర్వహించే ఈ సదస్సుకు సంబంధించి వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన చోడవరంలో ఆవిష్కరించారు. విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా రంగ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చాక విద్యార్థులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 600కోట్లు ఇప్పటి వరకూ విడుదల చేయకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. కాలేజీల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయన్నారు. తక్షణం బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ సీట్లు పూర్తిగా యాజమాన్యాలకు ఇవ్వడం అన్యాయమని, హాస్టళ్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు నాగదుర్గ, రాజు, నాయుడు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్

దేవరాపల్లి: రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలనుకోవడం అత్యంత దారుణమని, తక్షణమే కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. దేవరాపల్లిలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మాకవరపాలెం సహా రాష్ట్రంలోని పది కొత్త మెడికల్ కాలేజీలను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో నిర్మించాలని విడుదల చేసిన జీవో నంబర్ 590ను ఉపసంహరించుకోవాలన్నారు. మాకవరపాలెంలో మెడికల్ కాలేజీలో కొన్ని భవనాల నిర్మాణాలు చివరి దశకు చేరుకున్నాయన్నారు.

వీటిని పూర్తి చేసి వైద్య సేవలు ప్రారంభించే అవకాశం ఉన్నప్పటికీ ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణమన్నారు. వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండటమే మంచిదని, ఇదే విషయం పలు దేశాలలో రుజువైందన్నారు.

ప్రైవేటు మెడికల్ కాలేజీల కారణంగా వైద్య విద్య సాధారణ ప్రజలకు అందని ద్రాక్షగా మారిందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వమే కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి చేసి, ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని వెంకన్న డిమాండ్ చేశారు.

మిత్రులతో వెళ్లాడు.. శవమై తేలాడు..



- వ్యక్తి అనుమానాస్పద మృతి
- మృతదేహంతో బంధువుల రాస్తారోకో



ఏరియా ఆస్పత్రి ఎదురుగా మెయిన్ రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, (ఇన్‌సెట్) మృతుడు భాస్కర్(ఫైల్)

నర్సీపట్నం: మిత్రులతో కలిసి వెళ్లిన ఓ యువకుడు శవమై తేలాడు. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత సంతబయలకు చెందిన రామిశెట్టి భాస్కర్(34) ఈ నెల 8న ఇంటికి వచ్చిన ముగ్గురు స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆయన తల్లి లక్ష్మీ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భాస్కర్ సెల్‌ఫోన్ సిగ్నల్స్ నాతవరం మండలం డి.ఎర్రవరం వద్ద ఉన్నట్టు గుర్తించారు. కుటుంబ సభ్యులు ఆ ప్రాంతంలో గాలింపు చేసినా ఫలితం లేకపోయింది. కోటవురట్ల రూట్‌లో జోగినాథునిపాలెం సీసీ కెమెరాల్లో ఆయన కదలికలు రికార్డు అయ్యాయి. ఆ మార్గంలో బంధువులు గాలింపు చేయగా ఆర్ అండ్ బీ రోడ్డు కల్వర్టు కింద భాస్కర్ మృతదేహాన్ని గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం నర్సీపట్నం ఏరియా హాస్పిటల్ ఎదుట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. సుమారు గంట పాటు నర్సీపట్నం–చింతపల్లి మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. భాస్కర్ మరణంపై అనుమానాలు ఉన్నాయని, సమగ్ర విచారణ చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. భాస్కర్‌ను ఇంటి నుంచి తీసుకెళ్లిన స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారించాలని నినాదాలు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. భాస్కర్‌ను తీసుకువెళ్లిన వ్యక్తులు స్థానికంగా లాడ్జీలో ఉన్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

మాడుగుల రూరల్: మండలంలో తాటిపర్తి పంచాయతీ శివారు చిన కూర్మనాథపురంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్ తగిలి అల్లంగి సత్యనారాయణ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు కథనం మేరకు.. తన ఇంటి పక్కన్న ఉన్న మేనమామ ఇంటికి వెళ్లాడు. అక్కడ ఇంటి లోపల విద్యుత్ వైరు ప్రమాదవశాత్తు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సత్యనారాయణకు భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, శనివారం కేసు నమోదు చేస్తామని ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

హాస్టల్ విద్యార్థిని మృతి

నర్సీపట్నం: మండలంలో వేములపూడి బీసీ బాలికల వసతి గృహంలో విద్యార్థిని మృతి చెందింది. మాకవరపాలెం మండలం బూరుగుపాలెంకు చెందిన రంగాల హాసిని(13) ఇక్కడ వసతి గృహంలో ఉంటూ అక్కడే జెడ్పీ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం తెల్లవారుజామున కడుపు నొప్పిగా ఉందని సహచర విద్యార్థినులకు చెప్పింది. ఈ విషయం వాచ్‌మెన్ కుమారి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఓఆర్ఎస్ ద్రావణం ఇచ్చి తన పర్యవేక్షణలో ఉంచుకుంది. మరోసారి కడుపు నొప్పి రావడంతో ఉదయం 7 గంటల సమయంలో వేములపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ నుంచి కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మధ్యాహ్నం రెండు గంటల సమయంలో హాసిని మరింత ఇబ్బందికి గురైంది. దీంతో అనకాపల్లి ఏరియా ఆస్పత్రి తీసుకువెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యార్థిని మృతదేహాన్ని స్వగ్రామమైన బూరుగుపాలెం తరలించారు. కూతురు ఆకస్మిక మరణంతో తల్లి నాగమణి ఆవేదన చెందారు.

పరారైన గంజాయి నిందితుడి అరెస్టు




అరెస్టు చేసిన నిందితుడితో ఎస్ఐ సత్యనారాయణ

దేవరాపల్లి: గంజాయి కేసులో పరారైన మరో నిందితుడిని స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ శుక్రవారం అరెస్టు చేశారు. గతేడాది అక్రమంగా గంజాయి తరలిస్తూ పట్టుబడిన కేసులో మూడో నిందితుడు కందేరి వెంకట నాగరాజు పరారయ్యాడు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టి, దేవరాపల్లి వద్ద ఒంగోలుకు చెందిన సదరు నిందితుడిని పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

4 రోజుల్లో చోరీ కేసు ఛేదన



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు

- నిందితుడి అరెస్టు, చోరీ సొత్తు రికవరీ

నక్కపల్లి: చోరీ కేసును నాలుగు రోజుల్లోనే పోలీసులు ఛేదించారు. చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం వెల్లడించిన వివరాలు ప్రకారం.. ఈ నెల 8వ తేదీన వేంపాడులో కొత్త నాగేశ్వరరావు ఇంట్లో చోరీ జరిగింది. భోజన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి తాళాలు పగులగొట్టి రూ.72 వేలు, 53 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు సీసీపుటేజీల ఆధారంగా డీఎల్‌పురం గ్రామానికి చెందిన గింజాల అప్పారావు ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. ఈ క్రమంలో మధ్యవర్తుల సమక్షంలో అతడి నుంచి 27.25 గ్రాముల బంగారు చైన్, 14.78 గ్రాముల లాకెట్, 3 గ్రాముల లక్ష్మీదేవి ఉంగరం 7.86 గ్రాముల బంగారు ముద్ద, ఒక గ్రాము ఉంగరం, రూ.72 వేలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని అరెస్టు చేశారు. ఈ సమావేశంలో సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు, ట్రైనీ ఎస్ఐ అంజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బహుజన సంకల్ప జిల్లా సభ

అనకాపల్లి: బహుజన సమాజ్‌వాద్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూచౌక్ వద్ద శనివారం ఉదయం 9 గంటలకు బహుజన సంకల్ప సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా సూరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ విచ్చేస్తారన్నారు.

రేపు మొక్కలు నాటే కార్యక్రమం

అనకాపల్లి: గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో మండలంలో బీఆర్టీ కాలనీ, రామాలయం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో 500 మొక్కలు నాటుతామన్నారు. సభ్యులు, స్థానికులు హాజరు కావాలని కోరారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే మొక్కలను నాటి, వాటి పర్యవేక్షించాలన్నారు. భావితరాలను దృష్టిలో పెట్టుకుని మొక్కలను పెంచాలన్నారు. తద్వారా ప్రకృతిలో అన్ని జీవరాశులు ఆనందంగా జీవిస్తాయన్నారు.

ఘనంగా పుట్టుక మహోత్సవం

కశింకోట: దుర్గమాంబ పుట్టుక మహోత్సవం ఘనంగా శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి గరగలను పల్లకిలో గురువారం రాత్రంతా కశింకోటలో ఊరేగించారు. అనంతరం తీసుకువచ్చి వేకువజామున గవరపేటలోని అమ్మవారి ఆలయంలో నెలకొల్పారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 18 వరకు పూజలు చేసి, ఆ రోజు పండగను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల బుల్లిబాబు తెలిపారు.

మొరాయించిన లారీ



మొరాయించిన లారీని నెడుతున్న స్థానికులు

కశింకోట: స్థానిక కూడలిలో జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి లారీ అకస్మాత్తుగా మొరాయించి అడ్డంగా నిలిచిపోయింది. దీంతో రోడ్డుకు రెండు వైపులా అర్ధగంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. వాహన చోదకులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. లారీలో సిమెంట్ లోడ్ తీసుకు వచ్చి కశింకోటలో దుకాణం వద్ద దింపి తిరుగు ప్రయాణంలో అనకాపల్లి వైపు వెళ్లడానికి స్థానిక కూడలిలో రోడ్డు మలుపు దాటుతుండగా లారీ మొరాయించింది. ఎంత ప్రయత్నించినా మరమ్మతులకు గురై ముందుకు కదలలేదు. దీంతో క్రేన్ తీసుకు రావడానికి ఆలస్యం కానుండటం, అప్పటికే రోడ్డుకు రెండు వైపులా ట్రాఫిక్ నిలిచిపోవడంతో స్థానికుల సహకారంతో పోలీసులు ఆగిపోయిన లారీని రోడ్డుకు అడ్డు తొలగించారు. రోడ్డుపై నిలిచిపోయిన వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఆగిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. సీఐ అల్లు స్వామినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఐలు మనోజ్‌కుమార్, లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 56 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,210	4,900
రెండో రకం	3,800	3,800
మూడోరకం	3,700	3,780

అనకాపల్లి సినిమాలు

రాజా	:మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	:కిష్కింధపురి
సత్యనారాయణ స్క్రీన్-2	: కొత్త లోక
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10, బీ పాజిటివ్-15, ఓ పాజిటివ్-27, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 354 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 246 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

పనుల్లేక పస్తులు



నిలిచిపోయిన భవన నిర్మాణాలు

- బిల్లులు నిలిపివేసిన కూటమి ప్రభుత్వం
- ఏడాదిగా నిలిచిన భవన నిర్మాణాలు
- ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వేదన

తుమ్మపాల: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మికులకు కూలీ పని లేకుండా పోయింది. ప్రధానంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సచివాలయ సముదాయాలకు బిల్లులు నిలిపివేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న లేఅవుట్లు వేసి స్థలాలతోపాటు ఇళ్లను మంజూరు చేశారు. దాంతో భవన నిర్మాణ కార్మికులకు సొంత ఊర్లలోనే నిత్యం కూలీ లభించేది. ఐదేళ్ల పాటు ఖాళీ లేకుండా ఉపాధి పొందారు. దాదాపు నిర్మాణాలు పూర్తయినప్పటికీ కొంత మేర పనులు కొనసాగుతున్న క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇళ్లతోపాటు సచివాలయ భవనాలకు బిల్లులు చెల్లించక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనికితోడు కొత్తగా ఇళ్లను మంజూరు చేసిన పాపాన పోలేదు. దాంతో కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. అప్పులు చేసి కుటుంబాన్ని నెట్టుకొస్తున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1,570 ఇళ్ల నిర్మాణాలకు నిలిచిన బిల్లులు

జిల్లా కేంద్రంగా ఉన్న పట్టణంతోపాటు మండలంలో గత ప్రభుత్వంలో మొదలైన భవన నిర్మాణాలు కూటమి సర్కార్ రావడంతో నిలిచిపోయాయి. పనుల కోసం నిత్యం పట్టణానికి వచ్చే భవన నిర్మాణ కార్మికులు సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. పనులు లేక చాలామంది కూలీలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. మండలంలో జగనన్న లేఅవుట్‌లో మొత్తం 2,713 గృహాలు మంజూరైతే 1,570 ఇళ్ల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపు కాక వివిధ దశల్లో పనులు నిలిచిపోయాయి. అప్పులు చేసి పూర్తి చేయలేక లబ్ధిదారులు నిర్మాణ పనులు నిలిపివేశారు.

పస్తులుంటున్న భవన నిర్మాణ కార్మికులు

మండుటెండల్లో సైతం ఓర్చుకుని నిర్మాణ పనులు చేసే భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక పస్తులుంటున్నారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అనేక భవనాలకు బిల్లులు చెల్లింపును కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. భవన నిర్మాణ మేస్త్రీలు రోజుకు రూ.వెయ్యి, మగ కూలీ రూ.750, మహిళా కూలీ రూ.600 కూలీ రాగా, వారి ఖర్చులు పోను కనీసం రూ.500 ఇంటికి తీసుకెళ్లేవారు. కూటమి ప్రభుత్వంలో ఎటువంటి పనులు లేకపోవడంతో పిల్లల చదువులు, కుటుంబ జీవనానికి డబ్బులు లేక అప్పుల పాలవుతున్నామని భవన నిర్మాణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అసంపూర్తిగా నిలిచిపోయిన రేబాక సచివాలయ భవనం

ఏడాదిన్నరగా ఏ పనీ లేదు..

నేను భవన నిర్మాణ మేస్త్రీని. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే కూలీలకు పనులు అప్పగిస్తాను. ఒప్పందాలు చేసుకుంటూ చేతిలో కనీసం రెండు, మూడు ఇళ్ల నిర్మాణ పనులతో తీరికలేకుండా ఉండే వాడిని. ఏడాదిన్నర కాలంగా ఖాళీగా ఉంటున్నాను. నాతో పాటు నన్ను నమ్ముకున్న కూలీలకు పనులు చెప్పలేని విధంగా ఉంది. భవన నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి.

– రామాచారి, మేస్త్రి, అనకాపల్లి.

ఇళ్ల నిర్మాణాలు లేక ఖాళీగానే ఉంటున్నాం....



కొన్ని నెలలుగా ఇళ్ల నిర్మాణాలు పూర్తిగా నిలిచిపోయాయి. రెక్కాడితే గాని డొక్కాడని మాకు వారంలో ఒక్క రోజూ పని దొరకడం లేదు. ఇసుకతోపాటు ఇతర సిమెంట్, ఇనుము ధరలు అధికంగా ఉండటం, ప్రభుత్వ సహకారం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే ఆలోచన కూడా ఎవరూ చేయడం లేదు. కరోనా సమయంలో పనుల్లేక పడిన కష్టాలే ఇప్పుడు పడుతున్నాం.

– మల్లిబాబు, సెంట్రింగ్ మేస్త్రి, రేబాక గ్రామం

వరిపై ఆశించే తెగుళ్లపై అవగాహన



నరసింగబిల్లిలో వరి పొలం పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి

కశింకోట: వరి పంటపై ఆశించే పురుగులు, తెగుళ్లపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాధురి శరణ్య తెలిపారు. మండలంలోని నరసింగబిల్లిలో ఆత్మ సౌజన్యంతో వరి పంటపై క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పంటల రక్షణకు వాటిపై ఆశించే పురుగులు, తెగుళ్ల గురించి తెలుసుకునే విధంగా అవగాహన కలిగిస్తున్నామన్నారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగించవచ్చునన్నారు. అనంతరం రైతులతోపాటు వెళ్లి వరి సాగును పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈవో ఎ. నూకశ్రీనివాసరావు, ఏటీఎం పి. రామకృష్ణ, బీపీఏ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై డ్రోన్స్‌తో నిఘా



ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఒకే బండిపై నలుగురు వెళ్తుండగా డ్రోన్ కెమెరాలో రికార్డ్



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీసీ ఫుటేజీల సమూహం

- నిబంధనలకు అతిక్రమించిన వారిపై చర్యలు

అనకాపల్లి టౌన్: ట్రాఫిక్ ఉల్లంఘనదారులు ఇంత వరకూ పోలీసుల కళ్లు కప్పి పారిపోయేవారు. ఇప్పుడు డ్రోన్స్ వారి ఆటలను కట్టిస్తున్నాయి. రాంగ్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, రాంగ్ పార్కింగ్, సిగ్నల్ జంప్, వన్ వే ఉల్లంఘన, హెల్మెట్ లేకపోయినా ఇలా అనేక విధాలుగా ప్రయాణాలు చేస్తున్న ఉల్లంఘనదారులను పట్టేస్తున్నాయి. పోలీసుల నుంచి తప్పించుకున్నామనుకునే లోపే.. వారికి తెలియకుండానే డ్రోన్ కెమెరాలో క్లిక్ మనిపిస్తుంది. బండి నంబర్ ఆధారంగా చలానా విధించినట్లు సెల్‌ఫోన్‌కు మెసేజ్ వెళ్తుంది. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై డ్రోన్‌ల ద్వారా గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి పట్టణంలో 32 ప్రదేశాలకుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అవి స్టేషన్‌కు అనుసంధానం చేసి నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు. వీటితోపాటు ప్రాధాన్యత ఉన్న నాలుగు రోడ్ల జంక్షన్, పెరుగుబజార్ జంక్షన్, నూకాలమ్మ గుడి ప్రాంతాల్లో మైకులను ఏర్పాటు చేసి అక్కడ పహరా చేస్తున్న పోలీసులకు పోలీస్ స్టేషన్‌లో ఉన్న మానిటరింగ్ సెల్ నుంచి మాట్లాడే విధంగా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య వచ్చినా ఆధునిక టెక్నాలజీ సాయంతో సిబ్బందిని పంపించి సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై జరిమానాలు



డ్రోన్ కెమెరాతో నిఘా పెంచాం. ట్రాఫిక్ ఉల్లంఘనులపై జరిమానాలు విధిస్తున్నాం. ఎక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడినా సీసీ ఫుటేజ్ ద్వారా తెలుసుకొని డ్రోన్‌ను పంపించి తొందరగా పరిష్కరిస్తున్నాం.

–ఎం వెంకటనారాయణ, ట్రాఫిక్ సీఐ, అనాకాపల్లి

ఆర్టీసీ బస్సుల్లో సీట్లు లేక ఇబ్బందులు

అనకాపల్లి: ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు, సీనియర్ సిటిజన్స్‌కు, ఇతర ప్రయాణికులకు సీట్లు కేటాయించిన తర్వాతే మహిళలకు అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకురావాలని జిల్లా సీనియర్ సిటిజన్ నాయకుడు సూరిశెట్టి రమణ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయం అన్నారు. సీట్లు విషయంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. బస్సుల్లో ఖాళీ లేక చిన్నచిన్న తగాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. బస్సుల్లో నగదు చెల్లించి ప్రయాణించే వారికి సీట్లు కేటాయించాలని కోరారు.

ముగ్గురు ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం విభాగం ఎస్ఐ సూరిబాబు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను క్రైం విభాగం పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.5 లక్షల విలువైన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో క్రైం విభాగం ఎస్ఐ డి.సూరిబాబు వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణరాయపురంలోని సాయి మహల్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఉమ్మిడిశెట్టి భవానీశంకర్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను అపార్ట్‌మెంట్ ముందు ఈ నెల 2న రాత్రి పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు వాహనం కనిపించకపోవడంతో తీవ్రంగా గాలించాడు. ఫలితం లేకపోవడంతో 8న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెస్ట్ జోన్ క్రైం విభాగం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సూరిబాబు బృందం కేసును చాకచక్యంగా ఛేదించింది. ముద్దాయిలు విజయనగరం జిల్లా ఎస్ కోట మండలం ధర్మవరం గ్రామానికి చెంది కుక్కల మణికంఠ, వేపాడ మండలం వల్లంపూడికి చెందిన కవల జ్ఞానేంద్రసాయి అలియాస్ సాయి, కణితి భానుప్రకాష్ అలియాస్ భానులుగా గుర్తించారు. శుక్రవారం ఉదయం వారి నుంచి భవానీశంకర్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్‌తో పాటు మరొకటి, ఇంకో ఎఫ్ జెడ్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ సూరిబాబు, ప్రొహిబిషన్ ఎస్ఐలు వి.చినబాబు, షేక్ జిలానీ, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీ వి.పేరయ్యనాయుడు, పీసీలు టి.శివప్రసాద్, బి.దేముడునాయుడు, ఎల్‌కే తాతారావులను ఉన్నతాధికారులు అభినందించారు.

రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రపల్లి వీరుయాదవ్

అనకాపల్లి: జిల్లాలో దివ్యాంగులకు రూ.15 వేల పింఛన్ ఇవ్వాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్ కోరారు. గురువారం రాత్రి స్థానిక న్యూకాలనీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఆగస్టులో జిల్లా దివ్యాంగుల నిస్సహాయ స్థితిని పరిగణనలోకి తీసుకుని డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి సదరన్ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. వారికి రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, సభ్యులు కోనేటి భార్గవ్, చెట్టుపల్లి శ్రీనివాసరావు, కాళ్ల సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా గీతాంజలి



అనకాపల్లి టౌన్: గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా డైట్ కళాశాల విద్యార్థిని ఎంపికయ్యారు. కళాశాలలో సీఎస్ఎం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్ గీతాంజలి మల్టీ నేషనల్ కంపెనీ గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికైంది. ఆమెను ప్రిన్సిపాల్ ఆర్ వైకుఠరావు అభినందించారు.

విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ 1912

కశింకోట: విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు సత్వర పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత మంగళవారం స్థానిక వడ్డి వీధిలో ఈదురు గాలులకు కొబ్బరి కొమ్మలు పడి విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కలిగిందన్నారు. సమాచారం తెలిసిన వెంటనే సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేపట్టి సరఫరా పునరుద్ధరించారన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఏర్పడిన ప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ, తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి పి.సాగర్, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి అభిలాష్‌లు అనకాపల్లి జిల్లా తరఫున ఎంపికై రాష్ట్రస్థాయి సీనియర్ విభాగంలో ఆడనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 13, 14 తేదీల్లో కోనసీమ జిల్లా మండపేటలో జరుగుతాయన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సీఎల్ఎన్ ప్రసాద్, పీఈటీ వి.సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవిరావు, ఉపాధ్యాయులు రాంబాబు, వెంకటరావు తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై నిరసన



నిరసన తెలియజేస్తున్న ఏపీటీఎఫ్ మండల కార్యదర్శి గణేష్, ఉపాధ్యాయులు

అనకాపల్లి: ఉద్యోగుల, ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం తీవ్రమైన అలసత్వాన్ని ప్రదర్శిస్తోందని ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు వి.గణేష్ విమర్శించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమస్యలపై ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు విడుదల చేయడంలోను, ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడంలోను ప్రభుత్వం విఫలమైందన్నారు. 4 పెండింగ్ డీఏలు తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, మెమో నంబర్ 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్‌ను నియమించే వరకూ ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూలు ప్రాంగణంలో విష సర్పాల బెడద



కన్నూరుపాలెం హైస్కూలు ప్రాంగణంలో పెరిగిన తుప్పలు



తుప్పల్లో నుంచి నడిచి వెళుతున్న బాలికలు

- విద్యార్థుల భయాందోళన

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం హైస్కూలులో పాముల బెడదతో విద్యార్థులు బెంబేలెత్తుతున్నారు. పాఠశాల ఆవరణలో తుప్పలు బలిసి ఉండటం, బయట చుట్టు పక్కల పొలాలు ఉండటం వల్ల పాములు తరచుగా వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 200పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల పెద్ద పాము ఓ తరగతి గదిలోని బెంచి సొరుగు నుంచి బయటకు వచ్చి కలకలం సృష్టించింది. అనంతరం దాన్ని వధించారు. అంతకు ముందు రెండు, మూడు దఫాలు పాములు పాఠశాలలో దర్శనమిచ్చాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తు ఎవరికి ఇప్పటి వరకు హాని కలగలేదు. అయినప్పటికీ తరచుగా వస్తున్న విష సర్పాల వల్ల ఏ క్షణం ఎటువంటి హాని జరుగుతుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. దీని దృష్ట్యా పాఠశాల ఆవరణలో తుప్పలు తొలగించి శుభ్రపరిచి పాములు సంచారానికి తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్‌టీఈఎం డిగ్రీలకు ప్రజాదరణ



మాట్లాడుతున్న మహిళ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి సూర్యలక్ష్మి

అనకాపల్లి టౌన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎస్‌టీఈఎం డిగ్రీలు ప్రజాదరణ పొందుతున్నాయని మహిళ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఎన్ సూర్యలక్ష్మి తెలిపారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొత్తూరు ఏఎంఎల్ కళాశాలలో విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో సాంకేతిక పురోగతులు, అధ్యయనం వంటి అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కోర్సుకు పెరుగుతున్న ఉద్యోగ మార్కెట్లు, అధిక సంపాదనా సామర్థ్యం, ప్రపంచ కెరీర్ అవకాశాలతో సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. జయబాబు, వన్ స్టాప్ సెంటర్ కార్య నిర్వాహణాధికారి కె.ఎం.వి. మంజులవాణి, సోషల్ వర్కర్ మంగ, తదితరులు పాల్గొన్నారు.

శారదా నది ఉధృతి



కశింకోట వద్ద పెరిగిన శారదానది నీటిమట్టం

కశింకోట: స్థానిక గవరపేటలో శారదా నదిలో పెరిగిన నీటి ప్రవాహం వల్ల శుక్రవారం దోనె ప్రయాణాలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు అధిక ప్రవాహం రావడంతో అవకాశం లేక దోనెలను వేయలేదు. దీంతో నదిపై ఇక్కడ నుంచి దగ్గర మార్గంగా తమ పొలాలు, పశువుల శాలలకు నిత్యం రాకపోకలు సాగించే రైతులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామ శివారున దూరంగా ఉన్న వంతెన మీదుగా మూడు కిలో మీటర్ల దూరం వరకు నడచి వెళ్లి తమ పొలాలకు చేరుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొన్నారు. నదిలో నీటి మట్టం పెరిగిన ప్రతి సారి ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీని నివారణకు ఇక్కడ అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తి చేసి తమ కష్టాలను తీర్చడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీమా నగదు అందజేత



బీమా నగదును అందిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ

తుమ్మపాల: ప్రతి ఒక్కరూ జీవిత బీమా నమోదు చేసుకుని క్రమం తప్పకుండా ప్రీమియం చెల్లించాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. పట్టణంలో ఇండియన్ బ్యాంక్‌లో ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన క్లయిమ్‌దారులకు శుక్రవారం ఆయన బీమా సొమ్ము అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెంకు చెందిన రాయి నూకేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, అతడు బ్యాంక్ ఖాతా ద్వారా ఏటా పీఎంజేజేబీవై ప్రీమియం చెల్లించడం ద్వారా రూ.2 లక్షలు మంజూరైందన్నారు. మృతుని భార్య రామలక్ష్మిని నగదు అందించామన్నారు. కార్యక్రమంలో ఏబీఎం హరిశంకర్, బ్యాంక్ మిత్ర కోన నాయుడు పాల్గొన్నారు.

దుబ్బు దశలో వరిపైరుకు యూరియా

అనకాపల్లి: దుబ్బు దశలో వరిపైరుకు రాగల వర్షాలను ఉపయోగించుకుని 25 కిలోల యూరియాను బురద పదునులో సమానంగా వెదజల్లాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు సూచించారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో శాస్త్రవేత్తలతో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాతావరణ పరిస్థితుల కారణంగా వరిలో కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి.గుళికలను ఎకరాకు 8 కిలోల చొప్పున పొలంలో చల్లుకోవాలన్నారు. 30 రోజుల వెదవరిలో గడ్డి జాతి ఎరువు సమస్య ఎక్కువగా ఉన్నట్లయితే ఫెనాక్సాప్రాప్-ఇథైల్‌ను ఎకరాకు 250 మి.లీ. చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

అనకాపల్లి ఆర్టీసీ డీఎంగా అనుమశ్రీ



అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) అనకాపల్లి డిపో మేనేజర్‌గా కె.అనుమశ్రీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విశాఖ జిల్లా వాల్తేరు డిపోలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి డిపోలో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్)గా 2011-12లో విధులు నిర్వహించానన్నారు. డిపోలో అన్ని విభాగాలను పరిశీలించి దశలు వారీగా ఇక్కడ సమస్యలు పరిష్కరించడమే కాకుండా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. స్త్రీ శక్తి పథకంతో ఆర్టీసీలో ఓఆర్ రేటు పెరిగిందన్నారు. ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ధీరజ్ నర్సీపట్నం డిపోలో పూర్తి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.